క్లుప్తంగా

వైభవంగా పోలేరమ్మ జాతర



పోలేరమ్మను దర్శించుకుంటున్న జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గ పరిధిలోని సీతానగరం మండలం రాజవరంలోని గ్రామ దేవత పోలేరమ్మ వారి జాతర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా జగన్మాతను దర్శించుకున్నారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు.

బాపనమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



బాపనమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అనపర్తి: జ్యేష్ఠ మాసం శుద్ధ చవితి ఆదివారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని రామవరం గ్రామంలో కొలువై ఉన్న బాపనమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. చిత్తూరు జిల్లా మదనపల్లిలో జైలర్ టి.లక్ష్మణరావు దంపతులు, సీటీఆర్ఐ శాస్త్రవేత్త వి.శ్రీహరిగోపాలరావు నాయుడు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి బుచ్చిరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దుశ్శాలువాలతో సత్కరించారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని సన్నిధిలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేక, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని, పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు, అన్న సమారాధన నిర్వహించారు.

సౌకర్యవంతంగా కోనేరు



తీర్చిదిద్దిన శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కోనేరు

కోరుకొండ: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కోనేరు ప్రస్తుతం భక్తులకు ఉపయోగకరంగా మారింది. స్వామివారి పండగలు, పర్వదినాల్లో సేవా కార్యకలాపాలను నిర్వహించేందుకు కోనేరు సౌకర్యవంతంగా ఉంది. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రూ.లక్షల నిధులతో కోనేరును సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. దేవుని కల్యాణం, చక్రస్నానం సందర్భాల్లో భక్తులు కూర్చుని కార్యక్రమాన్ని తిలకించేలా అభివృద్ధి చేశారు. కోనేరులో ఉదయం, సాయంత్రం భక్తుల పుణ్యస్నానాలు, చిన్నారులు కేరింతలు కొట్టడం కనిపిస్తోంది.

కాలు జారితే.. ఘాటు దెబ్బలే..



గౌతమ ఘాట్ వద్ద గోదావరిలో దర్శనమిస్తున్న నాచు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఓ వైపు గోదావరి పుష్కరాలంటూ హడావుడి చేస్తున్న నగరపాలక యంత్రాంగం.. గోదావరిలో అనేక ఘాట్ల వద్ద కనిపిస్తున్న నాచు సమస్యపై కనీస దృష్టి సారించకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం గౌతమ ఘాట్‌లో మెట్లపై పట్టిన నాచుతో గోదావరిలో స్నానమాచరించే భక్తులతో పాటు, పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. ఘాట్‌లో మెట్లపై పూర్తిగా నాచు పట్టడంతో స్నానమాచరించేందుకు వెళ్లినప్పుడు కాలుజారి పడిపోతున్నారు. అంతేకాకుండా గోదావరిలో ఘాట్ పరిసర ప్రాంతాల్లో పూర్తిగా నాచు దర్శనమివ్వడంతో భక్తులు, పర్యాటకులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ఘాట్‌లో నాచు లేకుండా, గోదావరిలో ఉన్న నాచును తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కూటి కోసం.. ఈ పల్టీ వేయాల్సిందే..



జీవన భారం కంటే.. గుండెపై ఇది బరువే కాదు



నిప్పులు కక్కితేనే.. కడుపు నిండేది



ఈ నిప్పుల గుండం మాకు ఏపాటిది!

ఆట పండాలి.. కడుపు నిండాలి

బిక్కవోలు: కూటి కోసం కోటి విద్యలు అన్నారు పెద్దలు. చేసే ఏ పనైనా కడుపు నింపుకోవడానికే. దీనికోసం ప్రాణాలను కూడా పణంగా పెట్టి.. జనాన్ని ఆకట్టుకునేందుకు ప్రదర్శనలు ఇస్తుంటారు కొందరు. ఈ కోవలోకే వస్తారు మాల మాస్టీలు. మండలంలోని ఊలపల్లి గ్రామంలో మాల మాస్టీలు ఆదివారం ప్రదర్శించిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కొరుకుండ గ్రామం నుంచి వచ్చిన వీరు చేసిన అద్భుత విన్యాసాలు చూపరులను గగుర్పాటు కలిగించాయి. నిప్పుగోళం నుంచి అవలీలగా దూకడం, అనితరసాధ్యమైన బరువులను అవలీలగా ఒంటిచేత్తో ఎత్తడం, వంద కేజీల ఇనుప రాళ్లను గుండెలపై వేసుకోవడం, నోటి నుంచి మంటలను ఊదడం, గొర్రెపోతుతో గుండెపై ఢీకొట్టించడం వంటి విన్యాసాలు అబ్బురపరిచాయి. వీరు బుర్ర కథ కూడా ప్రదర్శించారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర, మహిళా విద్యకు సావిత్రీబాయి పూలే సాగించిన పోరాటాన్ని చక్కగా విశదీకరించారు.



ఊలపల్లిలో మాల మాస్టీ చేస్తున్న విన్యాసం

వెదజల్లు.. వెతలకు చెల్లు

- వరి సాగులో ఈ విధానమే మేలు
- కూలీల కొరతకు తగిన పరిష్కారం
- సాగు ఖర్చు కట్టడి
- దిగుబడులు పెరిగే అవకాశం



వరి సాగులో వెదజల్లు విధానం అవలంబిస్తున్న రైతులు

రాజానగరం: వరి పంట సాగులో కూలీల కొరతను అధిగమించడంలో వెద జల్లు పద్ధతి మేలైనది. మెట్ట ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు ఈ పద్ధతినే అవలంబిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు నీటి సదుపాయాలు ఉన్నచోట నార్లు వేసి, నాట్లు వేసేందుకు ఉత్సాహం చూపే రైతులు, ఆ అవకాశాలు లేనిచోట మాత్రం వెదజల్లు పద్ధతికి మొగ్గు చూపుతుంటారు. ఈ విధానంలో సాగు చేయడం వల్ల మొక్కల సాంద్రత సవ్యంగా ఉండి, దిగుబడి 10 నుంచి 15 శాతం పెరిగేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కూలీల కొరతను అధిగమించి, సకాలంలో సాగు చేసేందుకు ఈ విధానం మేలైన మార్గమని అంటున్నారు. వర్షాల పైనే ఆధారపడే రైతులు కూడా ఈ పద్ధతిని అనుసరించడం ఉత్తమమని వివరిస్తున్నారు.

సాగు నీటి ఎద్దడికి పరిష్కారం

డెల్టా ప్రాంతంలో మాదిరిగా మెట్ట ప్రాంతంలో సాగు నీటి సదుపాయాలు సమృద్ధిగా ఉండవు. ఇక్కడ ఎక్కువగా బోర్ల పైనే ఆధారపడి సాగు జరుగుతూ ఉంటుంది. బోర్లు లేని వారికి ఎత్తిపోతల పథకాల నుంచి ఆలస్యంగా విడుదలయ్యే నీరు, లేకపోతే వరుణుడు కురిపించే వర్షం చినుకులే ఆధారం. ఈ తరుణంలో పొలాలను దుక్కు చేసి, నార్లు పోసి, నాట్లు వేసేందుకు కాలంపై ఆధారపడక తప్పదు. అయితే అతివృష్టి, లేకుంటే అనావృష్టి వంటి పరిస్థితులు ఏర్పడినా రైతులకు సాగుకు ఇబ్బందులు తప్పవు. ఒకవేళ అన్నీ అనుకూలించినా, కూలీల కొరత అధికంగా ఉండటంతో సకాలంలో సాగు చేయడం కష్టతరమవుతుంటుంది. ఈ తరుణంలో వెదజల్లు విధానం ఎంతో మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. కూలీల కొరతను నివారించడంతో పాటు, అనుకున్న సమయంలో విత్తనాలు చల్లి, సాగును సకాలంలో చేపట్టేందుకు వీలుగా ఉంటుందంటున్నారు. దుక్కు చేసి, దమ్ము చేసిన భూముల్లో నేరుగా విత్తనాలను చల్లే విధానాన్నే వెదజల్లు అంటారు. ఈ విధానంలో నేరుగా విత్తనాలను చల్లడం వల్ల కలుపు సమస్య అధికంగా ఉండేందుకు అవకాశం ఉంది. దీని నివారణకు కొన్ని మెళకువలు పాటిస్తే సరిపోతుందని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వ్యవసాయ విభాగం అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు.

ఈ విధానంలో..

వరి సాగులో పెరిగిపోతున్న ఖర్చులను తగ్గించడంతో పాటు, కూలీల కొరతను నివారించడానికి తోడ్పడే వెదజల్లు పద్ధతిపై మెట్ట ప్రాంతంలో రైతులు ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ విధానంలో ఎకరానికి 15 నుంచి 20 కిలోల విత్తనం ఆదా అవడమే కాకుండా, సాగు చేసిన పంట వారం నుంచి పది రోజుల ముందుగానే కోతకు వస్తుంది. నారు పోయడం, నారు తీయడం, నాట్లు నాటడం వంటి ప్రక్రియలతో పని లేనందున.. ఎకరానికి రూ.మూడు వేల వరకు ఖర్చు కూడా ఆదా అవుతుంది. అలాగే మొక్కల సాంద్రత సరిపడా ఉండటం వల్ల దిగుబడి కూడా 10 నుంచి 15 శాతం పెరిగేందుకు అవకాశం ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులలో కూడా పంట కాలాన్ని కోల్పోకుండా నీరు అంటుబాటులో ఉన్నప్పుడే సాగు చేసుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుంది. వెదజల్లే పద్ధతిలో కలుపు యాజమాన్యంతో పాటు, ఎరువుల యాజమాన్యం కూడా కీలకం. భూముల్లో భాస్వరం శాతం అధికంగా ఉండటం వల్ల కేవలం ఆఖరి దుక్కిలో మాత్రమే వేసుకోవాలి. వ్యవసాయాధికారుల సూచనల మేరకు మాత్రమే ఎరువులను వాడాలి.

కలుపు నివారణకు..

వెదజల్లడానికి సేకరించిన విత్తనాలను 24 గంటల పాటు నానబెట్టి, చిన్నగా మొక్క బయటకు వచ్చే సమయంలో వాటిని పొలంలో చల్లాలి. విత్తనాలు చల్లే ముందు డీఏపీ మందును పొలమంతా చల్లడం ఉత్తమం. 48 గంటల తర్వాత కలుపు నివారణకు లీటరు నీటిలో పైరిజోసల్ఫ్యూరాన్ ఈథైల్ 100 గ్రా. లేదా కెంపా 12 గ్రా. రెండు లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మొక్క పల్చగా మొలిచిన తర్వాత నీరు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఈ సమయంలో కలుపును పూర్తి స్థాయిలో నివారించేందుకు ఎకరానికి ఫినాక్సినమ్ 400 మి.లీ. మందును రెండు లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సాధారణ నాట్లు వేసిన తర్వాత ఏవిధమైన యాజమాన్య పద్ధతులు తీసుకుంటామో వాటినే అనుసరించాలి. వెదజల్లు పద్ధతికి సమస్యాత్మక నేలలు.. అంటే చౌడు, క్షార, ఆమ్ల గుణాలు ఉండే నేలలు అనుకూలం కాదు. ఎట్టి పరిస్థితుల్లో యూరియాను అధికంగా వాడరాదు.

– డాక్టర్ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్త, కేవీకే

సత్ప్రవర్తనతో మంచి జీవితం



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

కోరుకొండ: సమాజంలో సత్ప్రవర్తన ద్వారానే మంచి జీవితాన్ని పొందవచ్చని కోరుకొండ సీఐ సత్యకిషోర్ అన్నారు. ఆదివారం మండలానికి చెందిన వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న 12 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మంచి ప్రవర్తనతో, ఆశాజనకమైన జీవనాన్ని పొందాలని సూచించారు. ఎటువంటి నేరపూరిత సంఘటనల్లో పాల్గొనవద్దని హితవు పలికారు. తమ కుటుంబాలతో సంతోషంగా జీవనం సాగించాలన్నారు. పలవురితో మాట్లాడి, వారి వ్యక్తిగత సమస్యలను తెలుసుకున్నారు. అవసరమైన సమయాల్లో పోలీసులకు సహకరించాలని కోరారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోరుకొండ: అనుమతి లేకుండా రాజమహేంద్రవరం నుంచి కోరుకొండకు ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం సీఐ సత్యకిషోర్, ఎస్సై కూన నాగరాజు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. కోరుకొండ మీదుగా భారీ వాహనాలు అనుమతులు లేకుండా ప్రయాణిస్తుండడంతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఎటువంటి బిల్లులు లేకుండా, అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో టిప్పర్‌ను పట్టుకుని, కేసు నమోదు చేశారు. దీనిని మైనింగ్ శాఖకు సిఫార్సు చేశారు.

చినుకులతో ఉపశమనం



చంద్రేడులో వర్షానికి ముందు కమ్ముకున్న మేఘాలు

రంగంపేట: రెండు రోజులుగా ఎండవేడి, మబ్బులతో ఉక్కపోతకు గురైన ప్రజలకు ఆదివారం ఉదయం కురిసిన మోస్తరు వర్షం ఉపశమనం కలిగించింది. కొద్ది రోజుల నుంచి ప్రజలు తీవ్ర ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. దీంతో శని, ఆదివారాల్లో ఓ మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం కాస్త చల్లబడింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉరుములతో కూడిన వర్షం ప్రారంభం కావడంతో జనజీవనం స్తంభించింది. ఈ వర్షం వేసవి దుక్కులకు మేలు చేకూరుస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి, పత్తి చేలు వేసే రైతులకు ఈ వర్షం ఉపయోగపడనుంది. అదేవిధంగా పామాయిల్ మొక్క తోటలకు, కూరగాయ పంటలకు కూడా ఈ వర్షం ప్రయోజనం కలిగిస్తుంది.

35 ఏళ్ల తర్వాత.. అపూర్వ కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

రాజానగరం: ఆత్మీయతతో కూడిన పలకరింపులు, అనుబంధాలను పంచే పరిచయాలు, చిన్ననాటి మధురస్మృతులను నెమరువేసుకుంటూ ఆ పూర్వ విద్యార్థులు రోజంతా ఉల్లాసంగా గడిపారు. ఐదు పదుల వయస్సు ఉన్న వారంతా ఒక్కసారిగా విద్యార్థి దశలోకి వెళ్లిపోయారు. 15 ఏళ్ల బాలల మాదిరిగా సరదాగా గడిపారు. మండలంలోని సంపత్‌నగరంలో ఆదివారం ఈ అపూర్వ దృశ్యాలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని ప్రకాష్‌నగర్ సెంటినరీ ఎయిడెట్ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు (1990) 35 ఏళ్ల తరువాత సంపత్‌నగరంలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో కలుసుకున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, విద్యార్థి దశలోకి వెళ్లిపోయారు. నాటి ఆనందానుభూతులను పంచుకుంటూ సందడి చేశారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకుంటూ, తమ పిల్లల ఎదుటే చిన్నపిల్లల్లా గంతులేశారు. సెల్ఫీలు, గ్రూపు ఫొటోలు తీసుకుని భద్రపరచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి, వారి ఆశీస్సులందుకున్నారు. 1990 నాటి బ్యాచ్‌కి సంబంధించిన మిత్రులందరినీ ఒకచోటకు చేర్చి, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కిరణ్మయి, సుంకర శ్రీను, ఎంఎస్ఎన్ రెడ్డి, సాంబశివ, భరద్వాజ్, ప్రసాద్, తుమ్మిడి శ్రీను, తిమోతి, ముంత కృష్ణ కీలకపాత్రను పోషించారు.

మంచి దిగుబడికి మట్టి పరీక్షలు



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న డాక్టర్ రమేష్‌బాబు

రాజానగరం: పంటల్లో పోషక లోపాలను గుర్తించి, వాటి నివారణకు సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం, సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పీవీ రమేష్‌బాబు అన్నారు. మండలంలోని దివాన్‌చెరువులో ఉన్న జిల్లా ఏరువాక కేంద్రంలో కోనసీమ జిల్లాలోని 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు చెందిన డీలర్లకు సర్టిఫికెట్ కోర్సులో భాగంగా వారం రోజులు జరుగుతున్న శిక్షణా తరగతులు ఆదివారం కొనసాగాయి. మొక్కల్లో పోషణ మూలకాల లోపం–నివారణ అనే అంశంపై శిక్షణ జరిగింది. పంటల్లో పోషక లోపం వల్ల కలిగే నష్టాలు, వాటిని గుర్తించే విధానం, నివారణా చర్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఘనంగా గంగాలమ్మ తీర్థం



ఆకట్టుకున్న గరగ నృత్యాలు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న కళాకారులు



కొంకుదురులో గంగాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న కమిటీ సభ్యులు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని గంగాలమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం అమ్మవారి జాతర జరిగింది. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, తీన్మార్, బుట్టబొమ్మలు, శక్తి, గారడీ వేషాలు, కేరళ వాయిద్యాలు, డీజే వంటి వాటితో అలరించారు. పడాల ఆడపడుచు కావడంతో ఆదివారం పడాల కుటుంబ సభ్యులు, వారి ఆడపడుచులందరూ అమ్మవారిని దర్శించుకున్నారు. పడాల సత్యనారాయణరెడ్డి మాస్టార్ ఇంటి వద్ద పాన్పు వేశారు. ఈ సందర్భంగా పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు పడాల కమలారెడ్డి, కర్రి సంతోష్‌రెడ్డి, సత్తి రామారెడ్డి, దత్తు, సునీల్, అనిల్, కొంకుదురు ఎంపీటీసీ కొంకుదురు పీవీ, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తదనంతర వీలునామా శ్రేయస్కరం



గుర్తింపు కార్డు ఇస్తున్న సెక్రటరీ శ్రీలక్ష్మి

కంబాలచెరువు: ఇటీవలి కాలంలో కుటుంబ బాంధవ్యాల్లో వచ్చిన మార్పుల దృష్ట్యా వృద్ధులు నిరాదరణకు, వేధింపులకు గురవుతున్నారని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎన్.శ్రీలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆర్థికాంశాల్లో ప్రేమానురాగాలకు అతీతంగా జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అన్నారు. ఆస్తిపాస్తులు కూడా తమ తదనంతరం మాత్రమే పిల్లలకు చెందేలా వీలునామా రాయాలని సూచించారు. స్థానిక ఆర్యాపురం ఏబీ నాగేశ్వరరావు పార్కులోని డేకేర్ భవనంలో సీనియర్ సిటిజన్ల ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, తల్లిదండ్రులు, పిల్లలకు మంచిచెడులపై, కుటుంబ బాంధవ్యాలు, ప్రేమానురాగాల విలువలను నేర్పించాలన్నారు. అందరికీ న్యాయం అందించాలనే ధ్యేయంతో ఏర్పాటు చేసిన న్యాయ సేవాధికార సంస్థ వృద్ధులు, మహిళలు, 18 ఏళ్లలోపు పిల్లలు, రూ.3 లక్షలలోపు ఆదాయం ఉన్నవారికి ఉచిత న్యాయం అందేలా దోహదపడుతుందన్నారు. అర్హత ఉన్నవారికి న్యాయపరంగా వచ్చే పెన్షన్, పట్టాలు అందకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి కూడా తమను సంప్రదించవచ్చన్నారు.

వృద్ధులపై వేధింపులు నివారించాలి

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో వృద్ధులపై పెరుగుతున్న వేధింపులు అరికట్టాలని స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. ఆదివారం నగరంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నుంచి అంబేడ్కర్ విగ్రహం మీదుగా దుర్గమ్మ గుడి ట్రాఫిక్ జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా వృద్ధులపై జరుగుతున్న వేధింపులు అరికట్టాలని, వృద్ధుల రక్షణకు చట్టాలు కఠినంగా అమలు చేయాలని నినాదాలు చేశారు. రాంబాబు మాట్లాడుతూ, సమాజంలో ఆస్తులు, డబ్బు కోసం వృద్ధులపై వేధింపులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.

యోగాంధ్ర ట్రయల్ రన్



యోగా చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం యోగాంధ్ర ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సూక్ష్మ వ్యాయమాలు, ఆసనాలు, ప్రాణయామం, ధ్యానం తదితర వాటిలో శిక్షణ పొందారు. పీడీ యువ రాజారెడ్డి విద్యార్థులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోణాల సత్తిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.